క్లుప్తంగా

నదులను పరిరక్షించుకోవాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అధ్యాపకులు

భీమునిపట్నం: నదులు మన దేశానికి జీవనాడి లాంటివని వాటిని పరిరక్షించుకోవాలని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకుడు గొట్టేటి రవి అన్నారు. ఆదివారం ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా డైట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. నదుల వల్ల ఆయా ప్రాంతాల ప్రజల జీవనానికే కాకుండా ఎన్నో పంటలను పండించుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే భారత దేశ సంప్రదాయాల ప్రకారం నదులను దేవతలతో పోల్చి పూజిస్తామన్నారు. మానవ తప్పిదాల వల్ల నదులు కలుషితం కావడంతోపాటు, దాని పరివాహక ప్రాంతాలు ఆక్రమణలకు గురవుతున్నాయని ఇది చాలా దురదృష్టకరమన్నారు.

నేటి నుంచి మండలస్థాయి క్రీడాపోటీలు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో సోమవారం నుంచి మూడురోజుల పాటు మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటలపోటీలు జరుగనున్నాయి. అండర్-14, 17 విభాగాలలో బాలురు, బాలికలకు వేర్వేరుగా జరిగే ఈ పోటీలలో యోగా, కబడ్డీ, చెస్, ఖోఖో, బాడ్మింటన్, వాలీబాల్, అథ్లెటిక్స్ నిర్వహించనున్నారు. సోమవారం బాలురకు, మంగళవారం బాలికలకు ఆటలపోటీలు నిర్వహించి, బుధవారం బాలురు, బాలికలకు అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్టు మండల కో ఆర్డినేటర్ చిల్ల వెంకటరెడ్డి తెలిపారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థిని మృతి

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలోని ఎస్ఆర్ అకాడమీలో ఇంటర్మీడియట్ బైపీసీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కె.భార్గవి (17) జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. కళాశాల యాజమాన్యం చికిత్స కోసం అదేరోజు మధురవాడ గాయత్రి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఆనందపురం పోలీసులు తెలిపారు. మృతురాలిది అనకాపల్లి జిల్లా కశింకోట మండలం జి.భీమవరం. మృతురాలి తల్లిదండ్రులు అప్పలరాజు, వెంకట ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై విచారణ చేపట్టాలి

మధురవాడ: నగరంలోని కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏబీవీపీ జిల్లా కార్యదర్శి సాయికుమార్, కన్వీనర్ నితిన్, జోన్ ఇన్‌చార్జులు వాసు, ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏబీవీపీ సాయికుమార్ మాట్లాడుతూ కళాశాలలో రెండోసారి ఇలాంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. తాము ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆత్మహత్యకు కారకులైన వారికి శిక్ష పడేలా చేస్తామన్నారు.

సమాచార కేంద్రానికి మోక్షమెన్నడో..!

- మూలకు చేరిన సమాచార కేంద్రం
- ప్రారంభించేందుకు ముందుకు రాని అధికారులు



ధ్వంసమైన ఫ్లోరింగ్



ప్రారంభానికి నోచుకోని సమాచార కేంద్రం

కొమ్మాది: తొట్లకొండ ఇది ఒక చారిత్రాత్మక పర్యాటక ప్రదేశం. సాగరానికి అభిముఖంగా ఉన్న ఈ కొండ నాటి బౌద్ధ భిక్షువులు నడియాడిన పవిత్ర ప్రదేశం. ఈ బౌద్ధ క్షేత్రాలు భారత దేశ సాంస్కృతిక చరిత్రకు ఆనవాళ్లు. ధ్యానమందిరాలు, రాతి స్తంభాలు, భోజన శాలలు, నీటి తొట్టెలు, మహాస్తూపం, ప్రధాన బౌద్ధ భిక్షువు గది, సమావేశ మందిరం ఇలా ఎన్నెన్నో చరిత్రకు సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి. కాల్చిన ఇటుకలతో నిర్మించిన నిర్మాణాలు, నేటికి చెక్కు చెదరకుండా కనిపించడం విశేషం. అంతే కాదు కొండపై నుంచి సముద్రాన్ని చూస్తే ప్రతి పర్యాటకుడికి మంచి అనుభూతినిస్తుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని పర్యాటకులను మరింతగా ఆకర్షించే విధంగా, ఇక్కడ చరిత్రను బావితరాలకు తెలిసే విధంగా ఆధునిక హంగులతో సమాచార కేంద్రాన్ని నిర్మించారు.

సమాచార కేంద్రం ప్రత్యేకత

ఈ సమాచార కేంద్రంలో ఇంటర్ ప్రిటేషన్ సెంటర్, గ్యాలరీ, పబ్లికేషన్ సెంటర్, సమావేశ మందిరం, మరుగుదొడ్లు, క్యాంటీన్ సదుపాయం ఉండేలా నిర్మించారు. అదే విధంగా దీని చరిత్రను తెలిపే విధంగా ఓ సమాచార కేంద్రాన్ని, సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఏళ్లు గడిచినా ఈ సమావేశ మందిరం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం ఈ సమాచార కేంద్రం చుట్టూ పెద్ద ఎత్తున తుప్పలు పెరిగిపోయాయి. ఈ సమాచార కేంద్రాన్ని చేరుకునే దారి అధ్వానంగా ఉంది. సమాచార కేంద్రంలో గల ఫ్లోరింగ్ అనేక చోట్ల ధంసమయ్యాయి. ఇదిలా ఉండగా పర్యాటకం, పురావస్తుశాఖ సమన్వయ లోపం వలనే ప్రారంభానికి నోచుకోవడం లేదనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యాటకులకు ఈ సమాచార కేంద్రాన్ని అందుబాటులో తీసుకోని రావాలని పలువురు కోరుతున్నారు.

అధికారుల దష్టికి తీసుకెళ్లాం

తొట్లకొండపై నిర్మించిన సమాచార కేంద్రం ప్రారంభం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఈ విషయం పురావస్తుశాఖ అధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లాం. త్వరలో ప్రారంభించి పర్యాటకులకు అందుబాటులో ఉండే విధంగా చూస్తాం.

– ఆర్. పాల్గుణరావు, పురావస్తు శాఖ ఏడీ.



అధ్వానంగా సమాచార కేంద్రానికి వెళ్లే దారి



చారిత్రాత్మక బౌద్ధ నిలయం తొట్లకొండ

వినాయక మండపం వద్ద అన్నదానం



కృష్ణాపురంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: వినాయక ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రెండు గ్రామాల్లో ఆదివారం అన్నదానాలు జరిగాయి. కృష్ణాపురంలో రామాలయం వద్ద నిలిపిన వినాయక విగ్రహం దగ్గర 2500 మందికి అన్నదానం చేశారు. అన్నదానాలను ఎంపీపీ కంటుబోతు రాంబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొలె అప్పలనాయుడు, గాడు అప్పలరాజు, టీడీపీ నాయకుడు మొకర అప్పలనాయుడు పాల్గొన్నారు. ఐనాడలో మామిడి శివ రామ కృష్ణ ఇంటి వద్ద నిలిపిన వినాయక విగ్రహం దగ్గర మూడు వేల మందికి అన్నదానం చేశారు. భీమునిపట్నం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోరాడ పాపారావు ఈ అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి శివరామకృష్ణ, కోరాడ రామేశ్వరరావు పాల్గొన్నారు.

70 మంది రక్తదానం



మామిడిలోవలో రక్తదానం చేస్తున్న మహిళలు

తగరపువలస: భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా ఆదివారం ఆనందపురం మండలం మామిడిలోవలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 70 మంది దాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు బలిరెడ్డి పెంటయ్య, అప్పలరాజు, సురేష్ పాల్గొని సహాయ సహకారాలు అందించారు. నగరానికి చెందిన ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు వైద్యురాలు ఎస్.దివ్యవాణి ఆధ్వర్యంలో ఎనిమిది మంది సిబ్బంది పాల్గొన్నారు. సత్యసాయి సేవాసంస్థల ఏపీ జాయింట్ సేవాదళ్ కన్వీనర్ పి.రాఘవరావు, జిల్లా మెడికల్ కో ఆర్డినేటర్ బి.సాయికుమార్, వివిధ భజన మండళ్ల ప్రతినిధులు అప్పలరాజు, కె.తమ్మునాయుడు, కె.లక్ష్మణమూర్తి, ఎంవీఎస్ సత్యసాయికుమార్, దేముడుబాబు, తాటిచెట్లపాలెం యువత పాల్గొన్నారు.

పెరుగుతున్న ధరలు..తగ్గుతున్న కొనుగోళ్లు



ఆనందపురం మార్కెట్ వద్ద పారబోసిన క్యాప్సికమ్, దొండకాయలు



పడేసిన టమాటా,పువ్వులు

తగరపువలస: ఇటీవల వర్షాలకు కూరగాయలు, ఆకుకూరలు, పూలతోటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. ఈ కారణంగా మార్కెట్లలో వీటి ధరలు అమాంతం పెరిగిపోయాయి. నష్టానికి విక్రయించలేక నిల్వ ఉండిపోయిన కూరగాయలు, పండిపోయి, కుళ్లిపోయిన, ఆకుకూరలను వ్యాపారులు పారవేస్తున్నారు. దీంతో వ్యాపారులు, రైతులు కూడా నష్టపోతున్నారు. తగరపువలస, ఆనందపురం ప్రాంతాలలో రైతుబజారులు లేకపోవడం ఈ ప్రాంతవాసులను అధిక ధరలు మరింత బాధిస్తున్నాయి. ఆనందపురం, భీమిలి, పద్మనాభంతో పాటు విజయనగరం జిల్లాలోని డెంకాడ, భోగాపురం మండలాలలో కూరగాయలు, ఆకుకూరలు, పువ్వులు విరివిగా సాగు చేస్తారు. వర్షాలకు ఆకుకూరలు ఎక్కువగా తుడిచిపెట్టుకుని పోవడంతో సాధారణ రోజుల్లో రూ.10కి లభించే కొత్తమీర, పుదీనా వంటి కట్టలు మూడు రెట్లు పెరిగిపోయాయి. ప్రస్తుతం ఆనందపురం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న కూరగాయల ధరలలో టమాటా రూ.50, బెండ రూ.40, వంకాయ రూ.80, బీర రూ.50, దొండ రూ.40, బంగాళాదుంప రూ.40, ఉల్లి రూ.70, క్యాప్సికం రూ.100, క్యారట్ రూ.40 లకు విక్రయిస్తున్నారు. ఆనందపురం మార్కెట్‌తో పోలిస్తే తగరపువలస ప్రయివేట్ మార్కెట్‌లో వీటి ధరలు అధికంగానే ఉంటున్నాయి.

దిగుమతి మరింత తగ్గి.. : ఆనందపురం, తగరపువలస మార్కెట్‌లకు భీమిలి డివిజన్‌తో పాటు కూరగాయలు ఎక్కువగా విజయనగరం, ఒడిశా, తూర్పుగోదావరి, కర్నూలు, చిత్తూరు, బెంగళూరు ప్రాంతాల నుంచి వస్తుంటాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులలో వీటి ధరలకు రెక్కలు వస్తుంటాయి. అదే సమయంలో డిమాండ్‌కు తగ్గట్టుగా చిల్లర వ్యాపారులు కొనుగోలు చేసినా అధిక ధరలకు జడిసి వినియోగదారులు వెనకడుగు వేస్తున్నందున కాలం చెల్లిపోయి పారబోస్తున్నారు. ఈ నష్టం ఒక్కో మార్కెట్లో రూ.వేలల్లో ఉంటుంది. పువ్వుల ధరలకు కూడా అన్‌సీజన్ కారణంగా రైతులు విక్రయించగా మిగిలినవి బయట పడేస్తున్నారు.


త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



బోయిపాలెంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారంలో విజయరాంపురం కమిటీ ప్రతినిధులు

తగరపువలస: త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవాసమితి, ఇందూజ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆనందపురం మండలంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరస్వామి రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంగ గ్రంథాలను ఇంటింటా పలువురికి పరిచయం చేశారు. ఆత్మ, పరమాత్మ, జీవాత్మలను తెలుసుకోవడంతో పాటు మధ్యాత్మ ఆరాధనతో ధర్మస్థాపన జరుగుతుందన్నారు. ఈ ప్రచారంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు వి.సురేష్, ఎస్.శ్రీనివాసరావు, కె.రాజు, కె.సంతోష్, లక్ష్మి, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ



ఆక్రమిత స్థలంలో నిర్మాణాలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇక్కడ గజం స్థలం లక్షల్లో పలకడంతో స్థానిక టీడీపీ నాయకుల సహకారంతో ప్రభుత్వ స్థలాల అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నా పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. రుషికొండ స్వర్ణ భారతి నగర్‌లో ప్రభుత్వ స్థలాన్ని 18 లక్షల రూపాయలకు ఓ వ్యక్తి అమ్మేశాడు. కొనుగోలు చేసిన వ్యక్తి చక్కగా నిర్మాణం చేపడుతున్నారు. ఇదంతా తెలిసిన టౌన్ ప్లానింగ్ సెక్రెటరీ ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పనులు నిలిపివేయమని వీఆర్‌వో కె. జగదీశ్వరరావు హెచ్చరించినప్పటికీ సెలవు రోజుల్లో పనులు కానిచ్చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలు పరిరక్షించుకోకుంటే కలెక్టర్‌ను ఆశ్రయిస్తామని స్థానికులు స్పష్టం చేశారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీలోని పెట్రోల్ బంక్ ఎదురుగా పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులకు ఆనందపురం పోలీసులు ఆదివారం సాయంత్రం అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.70,200 స్వాధీనం చేసుకున్నారు.

ఆదర్శ హిందీ ప్రేమీ మండలి పోటీలు

తగరపువలస: 71వ జాతీయ హిందీ పక్షోత్స వాలలో భాగంగా ఆదివారం భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర భాష హిందీ ఎందుకు నేర్చుకోవాలి అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలలో తెలుగు మీడియంలో 18 మంది, హిందీలో 76 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉపన్యాస పోటీలలో 16 మంది, చిత్రలేఖనం పోటీలలో 32 మంది పాల్గొన్నారు. మిగిలిన పద్యపఠనం, వేషధారణ పోటీలు త్వరలో నిర్వహించనున్నట్టు మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.

అదృశ్యమైన పెయింటర్ రాజమండ్రిలో ప్రత్యక్షం

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీ పాతపాలేనికి చెందిన పెయింటర్ దల్లి అప్పలరెడ్డి రాజమండ్రిలో ఉన్నట్టు ఇక్కడి పోలీసులు గుర్తించారు. ఈ ఏడాది మార్చి 25న ఇంటి నుంచి పనులకు వెళ్లిన అప్పలరెడ్డి ఇప్పటి వరకు ఇంటికి చేరలేదు. అతని భార్య సాయి నూకరత్నం అప్పట్లో ఫిర్యాదు చేయగా హెచ్‌సీ అప్పలరాజు దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా ఈ నెల ఒకటో తేదీన అప్పలరెడ్డి రాజమండ్రిలో రేషన్ తీసుకున్నట్టు గుర్తించి మరోమారు కేసు నమోదు చేశారు.

నీరు రాదు, లైట్లు వెలగవు



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును నిలదీస్తున్న స్థానికులు

- ఎమ్మెల్యే గంటాను నిలదీసిన ప్రజలు
- కార్యక్రమానికి జనం రాకపోవడంతో గంటా అసహనం

కొమ్మాది: 'మావార్డులో వీధి లైట్లు వెలగవు.. జీవీఎంసీ కుళాయి నీరు రాదు.. కొన్ని చోట్ల సీసీ రోడ్లు లేవు.. మేం ఎలా బతకాలి' అంటూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును స్థానికులు నిలదీశారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దరి వరాహిగిరినగర్‌లో ఆదివారం ఉదయం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా తమ ప్రభుత్వం ఏం చేసిందో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వివరించినప్పటికీ స్థానికుల నుంచి ఎటువంటి స్పందన లేదు. రుషికొండ, ఎండాడ, ఎస్సీకాలనీ, బీసీ కాలనీల్లో రాత్రి సమయాల్లో వీధిలైట్లు వెలగటం లేదని, మంచి నీటి సౌకర్యం కూడా లేదని దీనిపై సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి జనాలు రాకపోవడంతో అధికారులపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించడం చేతకాదా అంటూ వారిని నిలదీశారు. జనాలు లేకపోవడంతో పది నిమిషాల్లో కార్యక్రమం ముగించి మమ అనిపించారు.

విద్యార్థులకు పోటీతత్వం అవసరం



మాట్లాడుతున్న భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవిరావు



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తగరపువలస: విద్యార్థులు పోటీతత్వం అలవరచుకుని ముఖ్యంగా గణితం, సైన్సు సబ్జెక్టులలో పట్టు సాధించాలని భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు అన్నారు. ఆదివారం చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నేషనల్ మీన్స్ మెరిట్ కమ్ స్కాలర్‌షిప్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల కష్టానికి ఈ ఉచిత శిక్షణ తోడైతే విజయం సాధించవచ్చన్నారు. అలాగే ఇటీవల నేపాల్‌లో జరిగిన బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన విద్యార్థిని శరగడం ఆదిలక్ష్మిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేక అప్పారావు, ఉపాధ్యాయులు దత్తి రవి, జగన్, పక్కి నాగేశ్వరరావు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

33 అడుగుల గణనాథుని నిమజ్జనం



నిమజ్జనం నిర్వహిస్తున్న భక్తులు



లడ్డూ కైవసం చేసుకున్న రాము, రామారావు



ఆకట్టుకున్న వేషధారణలు

మధురవాడ: చంద్రంపాలెం ఏర్పాటు చేసిన 33 అగుడుల భారీ గణనాథుని విగ్రహానికి ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా నిమజ్జనం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను కోటాటం, అరకు ధింసా, కోబ్రా డాన్సుతో గ్రామం అంతా ఊరేగించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన చోటే సుమారు 500 లీటర్ల పంచామృతాలతో నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.1.40 లక్షలు పలికిన లడ్డూ

ఈ సందర్భంగా గణనాథుని లడ్డూ వేలంలో రూ.1.40లక్షలు ధర పలికింది. చంద్రంపాలెంకి చెందిన పిళ్లా రాము, స్వతంత్ర నగర్‌కి చెందిన రామారావులు వేలంలో దక్కించుకున్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



కార్పొరేటర్ కొండబాబుకు వినతి పత్రాన్ని అందిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

భీమునిపట్నం: తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జోన్ పరిధిలో మంచినీటి సరఫరా ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు కోరారు. ఆదివారం భీమిలి జోన్ పరిధిలోని 1, 2, 3, 4 వార్డుల కార్పొరేటర్లు అక్కరమాని పద్మావతి, గాడు చిన్నకుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ, దొలుపల్లి కొండబాబును కలిసి వినతి పత్రాలను అందజేశారు. తాము ఎంతో బాధ్యతగా విధులను నిర్వర్తిస్తున్నామని, వేతనాలు రూ.13వేలే ఇస్తున్నారన్నారు. దీంతో జీవనం కష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం తమకు వేతనాలను పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యం, గౌవర అధ్యక్షులు ఆనందరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.